క్లుప్తంగా

జగనన్నే రక్ష..



కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గం ఇర్రిపాకలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

బీజేపీ సంతకాల సేకరణ

ఆరిలోవ: టీటీడీ పాలక మండలి నుంచి అన్య మతస్తులను వెంటనే తొలగించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హనుమంతవాక వద్ద భక్తతుకారం ఆలయంలో ఆ పార్టీ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆలయాల్లో పవిత్రతకు భంగం కలుగుతుందన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమతా డిగ్రీ కళాశాలలో సీనియర్ విద్యార్థుల వీడ్కోలు వేడుక బుధవారం ఘనంగా జరిగింది. విద్యార్థులు నృత్యాలు, కేరింతల నడుమ ఈ కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఆచార్య ఎస్.విజయరవీంద్ర మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు న్యాయం



జైభీం నగర్‌లో కరపత్రాలు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

ఆరిలోవ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా పేదలందరికీ న్యాయం చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ప్రగతినగర్, జైభీం నగర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎంవీవీ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఏయే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారో మహిళలు, యువతను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా స్థానిక సమస్యలు ఉంటే కార్పొరేటర్, సచివాలయం సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పేద ప్రజలకు న్యాయం చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గూడు లేని నిరుపేదలకు జగనన్న ఇళ్లు మంజూరు చేస్తున్నారన్నారు. పేదలకు ఇస్తున్న ఆ ఇళ్లపై కూడా టీడీపీ నాయకులు రాద్ధాంతం చేయడం దారుణమన్నారు. అందుకే వచ్చే సాధారణ ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక రక్షాబంధన్



సంతపాలెం పాఠశాలలో చెట్లకు రాఖీ కడుతున్న విద్యార్థులు



వీసీ ప్రసాదరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



వెంకటరావుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ఆరిలోవ: అన్నాచెల్లెళ్ల అనురాగానికి ప్రతీక రాఖీ. దేశంలో అనాదిగా వస్తున్న రక్షాబంధన్ వేడుక సోదరి–సోదరుల ప్రేమకు చిహ్నంగా నిలుస్తోంది. గురువారం రాఖీ పండగను పురస్కరించుకుని ఆరిలోవలో బుధవారం సందడి నెలకొంది. రాఖీల విక్రయ స్టాళ్లు కళకళలాడాయి. చినగదిలి ప్రాంతం సంతపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు రక్షాబంధన్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా వృక్షా బంధన్ పేరుతో పాఠశాల ఆవరణలోని చెట్లకు పిల్లలతో రాఖీలు కట్టించారు. హెచ్ఎం ఎస్.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కరమానికి రాఖీలు కట్టిన బ్రహ్మకుమారీలు

ఎంవీపీ కాలనీ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావుకు ఎంవీపీ కాలనీలోని కార్యాలయంలో బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రాఖీ శుభాకాంక్షలు తెలిపారు.

వర్సిటీలో రక్షాబంధన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బుధవారం రక్షా బంధన్ నిర్వహించారు. వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని ఉదయం తన కార్యాలయంలో బ్రహ్మకుమారీలు కలిసి రాఖీ కట్టారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌తో పాటు పలువురు ఉద్యోగులకు కూడా బ్రహ్మకుమారీ సభ్యులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

7 వేల మంది రైతుల శిక్షణకు ప్రణాళిక

బీచ్ రోడ్డు: వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రైతుల సాధికారత కోసం ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో రైతులకు శిక్షణ ఇచ్చేందుకు టెక్నోసర్వ్ ఎన్జీవో సంస్థతో భాగస్వామ్యం చేసుకున్నట్లు ఫ్లిప్‌కార్ట్ ప్రతినిధి రజనీష్ కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్, బ్రాండింగ్, ప్యాకింగ్ ద్వారా తమ ఉత్పత్తులను ఎలా మెరుగుపరుచుకోవాలో రైతులకు శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రైతు ఉత్పత్తిదారుల సంస్థ(పీఎఫ్‌వో)ల ద్వారా సుమారు 7 వేల మంది రైతులకు ఏడాది కాలంలో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టెక్నోసర్వ్ ఇండియా ప్రతినిధి లీడ్ కృష్ణన్ హరిహరన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం అవసరం

ఆరిలోవ: డాక్టర్ వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో వర్ణపట శాస్త్రం, దాని ఆవశ్యకత అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రసాయన శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నా వర్సిటీ సైంటిస్ట్ కృష్ణమూర్తి, కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. రసాయన శాస్త్రంలో భాగమైన వర్ణపట శాస్త్రం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు సైన్స్ విభాగం అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా దేవుడు

బీచ్ రోడ్డు: జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు బీసీ యువజన సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా బంగారు దేవుడు నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం బీచ్ రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణు మాధవ్ అందజేశారు. బీసీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని దేవుడికి సూచించారు. తనకు పదవి ఇచ్చిన ఆర్.కృష్ణయ్యకు, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు రాయుడు రాకేష్‌కు దేవుడు కృతజ్ఞతలు తెలిపారు.

క్రేన్ ఢీకొని బీటెక్ విద్యార్థికి తీవ్రగాయాలు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో బస్టాప్ వద్ద అదే కాలేజీకి చెందిన బీటెక్ సెకండియర్ విద్యార్థి టి.వివేక్ ఆనంద్‌ను మంగళవారం సాయంత్రం క్రేన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా.. నగరంలోని కేఆర్ఎం కాలనీకి చెందిన వివేక్ ఆనంద్ కళాశాల విడిచిపెట్టిన తరువాత ఇంటికి వెళ్లే క్రమంలో బస్సు కోసం స్టాప్ వద్ద నిల్చున్నాడు. అదే సమయంలో విజయనగరం నుంచి విశాఖ వైపు వేగంగా నిర్లక్ష్యంగా వచ్చిన క్రేన్ విద్యార్థిని ఢీకొనడంతో ఛాతీ, పొట్టపై తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే అతడి స్నేహితులు సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో చికిత్సకు తరలించారు. బుధవారం క్షతగాత్రుడి తండ్రి ప్రభాకర్‌రావు ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ గంటా హరీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ ఎంవీవీకి అభినందనల వెల్లువ



ఎంపీ ఎంవీవీని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎంవీపీ కాలనీ/ఏయూ క్యాంపస్/బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు బుధవారం రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు బి.కాంతారావు ఆధ్వర్యంలో పలువురు అభినందనలు తెలిపారు. లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ విద్యార్థి విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ రెల్ల జానకిరామ్, జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. పార్టీ 22వ వార్డు ఇన్‌చార్జి పీతల గోవింద్‌తో పాటు పలువురు వార్డు నాయకులు ఎంపీని కలిసి అభినందనలు తెలిపారు. ఎంవీవీ సత్యనారాయణను 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. సమష్టిగా పని చేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంవీవీ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు మువ్వల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలు ఉమాగాంధీని సత్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన నౌకానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.ఉమాగాంధీని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. బుధవారం పాఠశాలను సందర్శించిన ఆయన అవార్డుకు ఎంపికైన ఉమాగాంధీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ నాయకులు మొల్లి అప్పారావు, మువ్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల మనసులను ఆకట్టుకునే విధంగా బోధన పటిమతో జాతీయ స్థాయిలో అవార్డును సాధించడం గర్వకారణమన్నారు. ఇటువంటి అవార్డులు మరింత స్ఫూర్తిని ఇస్తాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

మేడ పైనుంచి జారిపడి యువతికి గాయాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6కు చెందిన పావనీ(17) అనే యువతి మేడ పైనుంచి జారిపడి గాయపడిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పావనీ కొమ్మాదిలో చదువుకుంటూ, అక్కడ ఉంటోంది. ఇటీవల ఎంవీపీ కాలనీలోని ఇంటికి వచ్చింది. బుధవారం రాత్రి మేడపైకి ఎక్కి రెండు అంతస్తులపై నుంచి కిందపడిపోయింది. గుర్తించిన స్థానికులు యువతి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు హుటాహుటిన మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. యువతి తలకు తీవ్రగాయం కావడంతో వైద్యుల సూచన మేరకు కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పావనీ కాలు జారి కింద పడిందా? లేదా వేరే ఏమైనా కారాణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు.

హాస్టల్ భవనం పరిశీలన



హాస్టల్ మరమ్మతులపై చర్చిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థినుల వసతి గృహం ప్రగతి భవనాన్ని బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి పరిశీలించారు. వచ్చే నెలలో విద్యార్థులు వచ్చే సమయానికి హాస్టల్ మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. హాస్టల్ గదులు, టాయిలెట్స్, డైనింగ్ రూమ్ వంటివి పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేసి, పెయింటింగ్ వేయాలని సూచించారు. నూతనంగా పలు గదులను నిర్మించే అంశంపై వార్డెన్ వినుత, యూనివర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావుతో చర్చించి, తగిన సూచనలు చేశారు.